నమస్తే తెలంగాణ

ఈ వారం సినిమా DECEMBER

సాధారణంగా డిసెంబర్ మాసాన్ని సినిమాలకు ఆఫ్ సీజన్‌గా పరిగణిస్తారు. ఎట్లాగూ సంక్రాంతి బరిలో పెద్ద సినిమాల సందడి ఉంటుంది కాబట్టి డిసెంబర్ రిలీజ్‌ల విషయంలో దర్శకనిర్మాతలు వేచి చూసే ధోరణి అవలంభిస్తారు. అయితే ఈ ఏడాది అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తున్నది. డిసెంబర్ నెలలో దాదాపు డజనుకుపైగా సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. వీటిలో భారీ చిత్రాలతోపాటు చిన్న సినిమాలు కూడా ఉన్నాయి. దీంతో సంక్రాంతికి ముందే తెలుగు నాటసినిమా పండుగ సందడి చేయనుంది.

ఓటీటీ ఇంకా ఎదురుచూస్తుంది ఈ వికటకవి

ఓటీటీ హిట్

జీ5: నవంబర్ 28
తారాగణం: నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్, శిజు మీనన్, రఘు కుంచె తదితరులు
దర్శకత్వం: ప్రదీప్ మద్దాలి

డిటెక్టివ్ కథలు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. ఒక్కో పేజీ తిప్పిన కొద్దీ.. ట్విస్టుల మీద ట్విస్టులతో ఆశ్చర్యపరుస్తుంటాయి. అలాంటి కథలతో వచ్చే వెబ్ సిరీస్‌లు కూడా అంతే! ఒక్కో ఎపిసోడ్ గడుస్తున్న కొద్దీ ప్రేక్షకులను మునివేళ్లపై నిలబెడతాయి. సిరీస్ ఆసాంతం స్క్రీన్ వదలకుండా చేస్తాయి. అలాంటి కథతో తెలంగాణ నేపథ్యంలో వచ్చిన పీరియాడిక్ ఇన్వెస్టిగేటివ్ వెబ్ సిరీస్.. వికటకవి. జీ5లో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ తెలుగు వెబ్ సిరీస్.. హిట్‌టాక్‌తో టాప్‌గేర్‌లో దూసుకెళ్తున్నది.

1970 దశకంలో అమరగిరి సంస్థానం వేదికగా కథ నడుస్తుంది. అక్కడి దేవతలగుట్టకు అమ్మవారి శాపం ఉన్నదని స్థానికులు నమ్ముతుంటారు. ఆ ప్రాంతానికి వెళ్లినవారు వింతగా ప్రవరిస్తుంటారు. తమ గతాన్ని మర్చిపోతుంటారు. దాంతో అమరగిరి రాజు రాజా నరసింహారావు (శిజు మీనన్)కు బెంగ పట్టుకుంటుంది. ఎలాగైనా తన ప్రజలను కాపాడాలని అనుకుంటాడు. మరోవైపు ఉస్మానియా యూనివర్సిటీలో తెలివైన విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకుంటాడు రామకృష్ణ (నరేష్ అగస్త్య). తన తెలివితేటలతో అనేక సమస్యలను తేలిగ్గా పరిష్కరిస్తూ ఉంటాడు. అనారోగ్యంతో ఉన్న తన తల్లికి ఆపరేషన్ చేయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు కావాల్సిన డబ్బు లేక బాధపడుతుంటాడు. అదే సమయంలో అమరగిరి సమస్య అతని దృష్టికి వస్తుంది. దాన్ని పరిష్కరించి, వచ్చిన డబ్బుతో తల్లికి ఆపరేషన్ చేయించాలనుకుంటాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి అమరగిరికి వెళ్లిన రామకృష్ణకు ఎదురైన పరిస్థితులు ఏంటి? అసలు దేవతల గుట్ట మీద ఏం జరుగుతుంది? గుట్టపైకి వెళ్లినవారు తమ గతాన్ని ఎందుకు మర్చిపోతుంటారు? రాజా కొడుకు మహదేవ్ (తారక్ పొన్నప్ప) గతం ఏంటి? తెలివైన విద్యార్థిగా అందరి మన్ననలు అందుకున్న రామకృష్ణ.. అమరగిరి సమస్యను పరిష్కరించాడా? లేదా? అన్నది తెలుసుకోవాలంటే 'వికటకవి'ని వీక్షించాల్సిందే!

నాన్న.. నా వెంటే!

తనకు ఆపద వచ్చిన ప్రతిసారీ.. తన తండ్రి తనవెంటే ఉన్నారని చెప్పుకొచ్చింది స్టార్ హీరోయిన్ సమంత రుత్‌ప్రభు. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం రాత్రి మృతిచెందగా.. ఆయనతో ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ సోషల్‌మీడియాలో భావోద్వేగ పోస్ట్ పెట్టింది సమంత. తాను కెరీర్‌లో ఈ స్థాయికి ఎదిగానంటే.. దానికి కారణం తన తండ్రే అని రాసుకొచ్చింది. 'మా నాన్న మాకు చిన్నతనం నుంచే విలువలు, కష్టపడటం గురించి నేర్పించేవారు. విజయాలను చూసి పొంగిపోవద్దని చెప్పేవారు. ఆయన మాటలే నా జీవిత ప్రయాణాన్ని అందంగా తీర్చిదిద్దాయి. అయితే, నేను సొంతంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలు నా జీవితంపై తీవ్ర ప్రభావం చూపాయి. అనేక కష్టనష్టాలకు గురిచేశాయి. అలా నేను బాధపడ్డ ప్రతి సందర్భంలోనూ నా తండ్రి నాకు తోడుగా ఉన్నారు. ఇండస్ట్రీతోపాటు వ్యక్తిగత జీవితంలో నేను ఎదుర్కొన్న అనేక పోరాటాల్లో ఆయన నాకు అండగా నిలిచారు' అంటూ తండ్రితో తనకున్న అనుబంధం గురించి చెప్పుకొచ్చింది సమంత. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లిదండ్రులను మాత్రం ఎప్పటికప్పుడు కలుస్తుండేది. ఇక తన కూతురు స్టార్ హీరోయిన్‌గా ఎదిగినా.. మీడియాకు దూరంగానే ఉన్నారు జోసెఫ్ ప్రభు. కానీ, 2021 అక్టోబర్‌లో సమంత – నాగ చైతన్య విడాకులు తీసుకున్న ఏడాది తర్వాత.. వారి పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. జరిగిన దానిపై తన ఆవేదనను వ్యక్తం చేశారు. వారి విడాకుల విషయాన్ని అంగీకరించడానికి తనకు చాలాకాలం పట్టిందని చెప్పుకొచ్చారు. ఇద్దరూ తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని ఆకాంక్షించారు.

అలా అనడం.. అవమానించడమే!

బాలీవుడ్‌లో 'బంధుప్రీతి' అనేది ఎప్పుడూ చర్చనీయాంశమే! 'నెపోటిజం' వల్ల అవకాశాలు కోల్పోయామని కొందరు అంటుంటే.. 'స్టార్ కిడ్స్' ముద్రతో ఇబ్బంది పడుతున్నామని మరికొందరు అంటున్నారు. తాజాగా, బాలీవుడ్ బ్యూటీ ఇదే విషయంపై స్పందిస్తూ.. 'స్టార్ కిడ్' అని సంబోధించడం తమను అవమానించడమేనని చెప్పుకొచ్చింది.

ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో కనిపించిన అనన్య పాండే.. 'స్టార్ కిడ్'గా ఉండటం ఎంత కష్టమో వివరించింది. 'మీరు ఎక్కడినుంచి వచ్చారన్నది ముఖ్యం కాదు.. ఏం సాధించారన్నదే ముఖ్యం. నా తండ్రి వైద్యుల కుటుంబానికి చెందినవాడు. కానీ, వాళ్లలా డాక్టర్ కావాలని అనుకోలేదు. యాక్టర్ అవ్వాలని కోరుకున్నాడు. ఇండస్ట్రీలోకి వచ్చి.. కష్టపడి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. నేను కూడా ఆయన బాటనే ఎంచుకున్నా! ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. కానీ, కొందరు నన్ను ఇప్పటికీ 'స్టార్ కిడ్'గానే చూస్తున్నారు. అది ఏమాత్రం అమోదయోగ్యం కాదు. స్క్రీన్‌పై ఎవరినైనా చూసినప్పుడు.. 'అరే.. ఈమె ఫలానా స్టార్ కూతురు' అని అనాల్సిన అవసరం లేదు. నటీనటుల బ్యాక్‌గ్రౌండ్ కన్నా.. వాళ్ల పర్ఫార్మెన్స్ చూడాలి' అని చెప్పుకొచ్చింది అనన్య. ఇంకా ఏమన్నదంటే.. ''సినిమా ఇండస్ట్రీ మాకు ఎంతో ఇచ్చింది. ప్రేక్షకులు కూడా మమ్మల్ని గొప్పగా ఆదరిస్తున్నారు. తనను నమ్మకున్న ఎంతోమందిని సినిమా రంగం ఆదుకున్నది. అందులో సినిమా నేపథ్యం ఉన్న కుటుంబాలతోపాటు బయటి నుంచి వచ్చిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చిన షారుక్ ఖాన్.. కొన్నాళ్లుగా బాలీవుడ్ బాద్‌షాగా వెలుగొందుతున్నారు కదా! కాబట్టి, సినీరంగంలో రాణించాలంటే.. వారి కుటుంబానికి సినీ నేపథ్యమే ఉండాల్సిన అవసరం లేదన్నది నా అభిప్రాయం. అలాగే, ఇతను ఇన్‌సైడర్.. అతను ఔట్‌సైడర్ అంటూ వేరుచేయడం కూడా మంచి పద్ధతికాద'ని పేర్కొన్నది. బాలీవుడ్‌లో 100కు పైగా చిత్రాల్లో కనిపించి.. విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన చుంకీ పాండే వారసురాలిగా ఇండస్ట్రీలోకి వచ్చింది అనన్య పాండే. తక్కువ సినిమాలే చేసినా.. తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నది. నిత్యం ఏదో ఒక విషయంతో సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది. విజయ్ దేవరకొండ సరసన 'లైగర్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.

ఖాన్‌కూ కరోనా షాక్

కరోనా మహమ్మారి.. అన్ని రంగాలతోపాటు సినీ పరిశ్రమనూ తీవ్రంగా దెబ్బతీసింది. దాని ప్రభావం బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమిర్‌ఖాన్‌పైనా పడింది. ఎంతలా అంటే.. ఒకానొక దశలో సినీరంగాన్ని వదిలేసుకోవాలన్న ఆలోచనకు వచ్చాడట ఆమిర్. ఈ విషయాన్ని ఆయన కూతురు ఇరా ఖాన్ ఇటీవల బయటపెట్టింది. ఒక ఇంగ్లిష్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'కరోనా వల్ల అన్ని రంగాలూ దెబ్బతిన్నాయి. అదే సమయంలో ఎన్నో ప్రాణాలు పోయాయి. అప్పుడే నాన్న కూడా సినీ రంగాన్ని వదిలేయాన్న ఆలోచన చేశారు. అయితే, ఇప్పుడే అంతటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని మాకు అనిపించింది. అదే విషయాన్ని ఆయనతో పంచుకున్నాం. కరోనా రోజులను వేరే కోణంలో చూడాలనీ, కెరీర్‌కు సంబంధించిన విషయాలపై తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దనీ చెప్పాం. కొన్ని రోజులపాటు అన్నిటినీ పక్కన పెట్టి.. కాస్త చిల్ అవ్వమని సలహా ఇచ్చాం. దాంతో ఆయన మనసు మార్చుకున్నారు. కెరీర్ గురించిన ఆలోచనలను వదిలేసి.. కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపాలని నిర్ణయించుకున్నారు. క్రమంగా మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చారు' అని చెప్పుకొచ్చింది ఇరా ఖాన్. కరోనా తర్వాత ఆమిర్‌ఖాన్ ఒకటి రెండు సినిమాల్లో గెస్ట్ రోల్స్ మాత్రమే చేశాడు. 2022లో 'లాల్‌సింగ్ చద్దా'తో పూర్తిస్థాయిలో నటించాడు. ప్రస్తుతం సితారే జమీన్‌పర్, గజినీ సీక్వెల్ చిత్రాల నిర్మాణంలో బిజీగా ఉన్నాడు.

డిసెంబరిలో డజను చిత్రాలు

ప్రస్తుతం దేశమంతా 'పుష్ప–2' మేనియాలో ఉంది. ఈ నెలలో రిలీజ్ అవుతున్న పెద్ద సినిమా ఇదే. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో పర్యటిస్తున్న చిత్ర బృందానికి అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకోవడం, అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు రావడంతో 'పుష్ప' రాజ్ ఓ బ్రాండ్‌లా తయారయ్యాడు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ మాస్‌కు బాగా రీచ్ అయింది. ఈ నెల 5న 'పుష్ప–2' సృష్టించే వైల్డ్‌ఫైర్ ఎలా ఉంటుందో చూద్దామని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా దేశవ్యాప్తంగా 12వేల స్క్రీన్స్‌లో భారీ స్థాయిలో విడుదలవుతుండటం విశేషం. 'పుష్ప–2' రిలీజ్ తర్వాత వారం పాటు మరో సినిమా రావడం లేదు. దాదాపు రెండు వారాలపాటు బాక్సాఫీస్‌ను రూల్ చేసేందుకు 'పుష్ప–2' సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా తర్వాత.. వేదిక ప్రధాన పాత్రలో నటించిన 'ఫియర్' డిసెంబర్ 14న విడుదలవుతున్నది. అరవింద్ కృష్ణ, జయప్రకాష్, పవిత్రా లోకేష్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా ఇప్పటికే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అవార్డులను గెలుచుకుంది.

డిసెంబర్ ప్రథమార్థం మొత్తం థియేటర్లలో 'పుష్ప–2' సందడే కనిపించనుంది. ఇక మూడో వారం నుంచి వరుస సినిమా జాతర మొదలుకానుంది. ఏకంగా పదికిపైగా చిత్రాలు విడుదలకానున్నాయి. వాటిలో అల్లరి నరేష్ 'బచ్చలమల్లి', ప్రియదర్శి 'సారంగపాణి జాతకం'తో పాటు కన్నడ హీరో ఉపేంద్ర డబ్బింగ్ చిత్రం 'యూఐ', విజయ్ సేతుపతి 'విడుదల పార్ట్–2' సినిమాలు డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. గత రెండేళ్లుగా మంచి విజయం కోసం వేచి చూస్తున్న అల్లరి నరేష్ 'బచ్చలమల్లి' విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో 1990 దశకం నేపథ్యంలో పీరియాడిక్ చిత్రంగా దీనిని తెరకెక్కించారు. సుబ్బు మంగదేవి దర్శకుడు. 'నాంది' తరహాలో తన కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుందని అల్లరి నరేష్ ప్రచార కార్యక్రమాల సందర్భంగా చెప్పడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి.

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ప్రియదర్శి నటిస్తున్న 'సారంగపాణి జాతకం' సినిమా కూడా డిసెంబర్ రేసులో రానుంది. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? చేతల్లో ఉంటుందా? అనే అంశాన్ని చర్చిస్తూ హాస్యప్రధానంగా తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. గత కొంతకాలంగా దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ హిట్ సినిమా కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ సినిమా ఆ లోటు తీర్చుతుందనే నమ్మకంతో ఉన్నాడాయన. కన్నడ అగ్ర నటుడు ఉపేంద్ర 'యూఐ' చిత్రంపై కూడా అంచనాలున్నాయి. పీరియాడిక్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ఓ గ్లోబల్ ఇష్యూని చర్చిస్తూ తెరకెక్కించామని మేకర్స్ అంటున్నారు. ఉపేంద్ర కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ సినిమా తీశారు. ఉపేంద్ర డైరెక్ట్ చేసే సినిమాల్లో ఏదో వైవిధ్యం ఉంటుందని ప్రేక్షకులు భావిస్తారు. దాంతో 'యూఐ' సినిమాపై హైప్ క్రియేట్ అయింది. ఇక వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ 'విడుదల' తమిళంలో సంచలన విజయం సాధించింది. అయితే తెలుగులో మాత్రం అంతగా ఆదరణ దక్కలేదు. ఇప్పుడు 'విడుదల–2' ప్రేక్షకుల ముందుకొస్తున్నది. విజయ్ సేతుపతి, సూరి, మంజు వారియర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

'ది లయన్ కింగ్' చిత్రానికి ప్రీక్వెల్‌గా రూపుదిద్దుకున్న 'ముఫాసా' డిసెంబర్ 20న విడుదలకానుంది. ఇందులో ముఫాసా పాత్రకు అగ్ర హీరో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ అందించడం విశేషం. రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించిన 'ఎర్రచీర: ది బిగినింగ్' చిత్రం కూడా డిసెంబర్ 20నే రిలీజ్ అవుతున్నది. మదర్ సెంటిమెంట్ ప్రధానంగా రూపొందించిన ఈ చిత్రానికి సుమన్‌బాబు దర్శకుడు. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన 'మ్యాజిక్' చిత్రం డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. అంతా కొత్తవారు నటించారు. అయితే సితార ఎంటర్‌టైన్‌మెంట్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థ తెరకెక్కించడం, అనిరుధ్ మ్యూజిక్ అందించడంతో సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. కాలేజీ నేపథ్యంలో సంగీతభరిత కథాంశంతో తెరకెక్కించిన ఈ సినిమా యూత్‌ను మెప్పిస్తుందని చిత్ర బృందం చెబుతున్నది. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో వస్తోన్న క్రైమ్ కామెడీ 'రాబిన్‌హుడ్' క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలకానుంది. 'భీష్మ' లాంటి హిట్ సినిమా తర్వాత నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే పాజిటివ్ బజ్ ఏర్పడింది. శ్రీలీల కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఇటీవల విడుదల చేసిన టీజర్ ఆకట్టుకునేలా ఉంది. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారని, ఈసారి హిట్ పక్కా అని నితిన్ నమ్మకంతో ఉన్నాడు. వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రలో నటించిన డిటెక్టివ్ కామెడీ చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' డిసెంబర్ 25న విడుదల కానుంది. రైటర్ మోహన్ రూపొందించిన ఈ చిత్రంలో అనన్య నాగళ్ల కథానాయిక. ఇందులో ప్రైవేట్ డిటెక్టివ్‌గా వెన్నెల కిషోర్ పాత్ర ఆద్యంతం నవ్వుల్ని పంచుతుందని మేకర్స్ అంటున్నారు.

కీర్తి సురేష్ తొలి హిందీ చిత్రం 'బేబీ జాన్' డిసెంబర్ 25న రానుంది. తమిళ చిత్రం 'తేరి' రీమేక్ ఇది. వరుణ్‌ధావన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాపై మంచి అంచనాలున్నాయి. హిందీలో తనకు శుభారంభాన్నిస్తుందని కీర్తి సురేష్ నమ్మకంతో ఉంది. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్ ప్రధాన పాత్రల్లో నటించిన స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్ 'పతంగ్' డిసెంబర్ 27న రిలీజ్ కానుంది. ప్రణీత్ పత్తిపాటి దర్శకుడు. గాలిపటాల పోటీ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. మొత్తంగా క్రిస్మస్ బరిలో 12కు పైగా చిత్రాలు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో సంక్రాంతి కన్నా ముందే వరుస సినిమాలతో బాక్సాఫీస్ కళకళలాడనుంది.

... సినిమా డెస్క్